సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 18 । నవంబర్ । 2024



జూలో సందడి
జూలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం జోష్‌గా గడిపారు 8లో

రొయ్య రయ్‌రయ్



వైజాగ్ రొయ్యేంటి..? విమానంలో చక్కర్లు కొట్టడమేంటని ఆలోచిస్తున్నారా.? నిజమేనండీ బాబూ... మన రొయ్య ప్రత్యేక విమానంలో ప్రయాణిస్తూ.. దేశ విదేశాల్లో మీసం మెలేస్తోంది. రెండు దశాబ్దాల కిందటి వరకూ మనందరితో పాటు రైళ్లలో ప్రయాణించిన రొయ్య పిల్ల.. పాపం.. ప్రాణవాయువు అందక విలవిల్లాడేది. కానీ ఇప్పుడు తనకంటూ ఓ చరిత్ర రాసుకుంది. ఏకంగా ఫ్లైట్‌లో మహా నగరాలకు రయ్ మంటూ నీటిలో కంటే వేగంగా గాల్లో దూసుకుపోతోంది. రెండు గంటల వ్యవధిలోనే అనుకున్న ప్రాంతానికి చేరుకొని హాయిగా విదేశాలకు వెళ్లిపోతోంది. అసలీ రొయ్యేంటో..? విమానంలో తిరగడమేంటో.? తెలుసుకోవాలంటే.. మనమంతా అలా సరదాగా విశాఖపట్నం విమానాశ్రయానికి వెళ్లాల్సిందే. -సాక్షి, విశాఖపట్నం

దేశవిదేశాలకు రొయ్యపిల్లల సరఫరా కేంద్రంగా విశాఖ

- విమానాశ్రయం నుంచి వివిధ నగరాలకు రవాణా
- విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి కార్గో రవాణాలో ష్రింప్‌దే అగ్రస్థానం
- నెలకు సగటున లక్షన్నర కిలోల రొయ్య పిల్లల రవాణా
- గల్ఫ్, యూరప్ దేశాలకూ ఎగుమతులు

ఉత్తరాంధ్ర ప్రాంతంలో రొయ్యల ఉత్పత్తి ఎక్కువగా ఉంటోంది. దీన్ని సక్రమంగా రవాణా చేయగలిగితే మంచి ఫలితాలు సాధించవచ్చు. గతంలో ఇక్కడి నుంచి రొయ్యపిల్లలు (ష్రింప్ సీడ్) రవాణా చేసేందుకు చాలా ఇబ్బందులు ఉండేవి. ఇక్కడి నుంచి సూరత్‌కు తీసుకెళ్లాలంటే ముంబాయికి వెళ్లి.. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా గాని తిరిగి విమానంలో గాని తరలించేవారు. దీనికి 18 నుంచి 24 గంటలు సమయం పట్టేది. దీని వల్ల రొయ్యలకు సరైన ఆక్సిజన్ అందకపోవడంతో చాలా వరకు మృత్యువాత పడి.. తీవ్ర నష్టం వాటిల్లేది. అదేవిధంగా విశాఖ విమానాశ్రయంలో లోడు చేసేందుకు వచ్చిన విమానాలకు పార్కింగ్ చేసే స్థలం లేకపోతే ఇక్కడే రోజుల తరబడి నిలిచిపోయేవి. దీని వల్ల కూడా రైతులు నష్టపోయేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. నేరుగా ప్రతి డొమెస్టిక్ విమానంలోనూ ప్రత్యేకంగా వీటి కోసం ఏరేంజ్‌మెంట్స్ చేసి పంపిస్తున్నారు.

గుజరాత్ నుంచి గల్ఫ్ దేశాలకు...

ఉత్తరాంధ్రలోని రొయ్య పిల్లలు ఏపుగా పెరుగుతాయి. వీటి రుచి కూడా అద్భుతంగా ఉండటంతో దేశంలోని పలు ప్రాంతాలతో పాటు వివిధ దేశాల ప్రజలకు ఇక్కడి రొయ్యలంటే మహా ఇష్టం. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన పలు ప్రాంతాల నుంచి వైజాగ్ ఎయిర్‌పోర్టుకు రొయ్య పిల్లలు వస్తుంటాయి. ఇక్కడి నుంచి చెన్నై, పశ్చిమ బెంగాల్, గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, ఢిల్లీకి చెందిన వ్యాపారులు తరచూ ఇక్కడి రైతులతో సంప్రదింపులు చేసి కొనుగోళ్లు చేస్తుంటారు. ఆయా ప్రాంతాలకు తీసుకెళ్లి అక్కడ పెంచి మంచి డిమాండ్ వచ్చినప్పుడు ముంబై, కోల్‌కతాలోని పోర్టులు, విమానాశ్రయాల ద్వారా పశ్చిమ దేశాలకు, గల్ఫ్, యూరప్ ప్రాంతాలకు ఎగుమతులు చేస్తుంటారు.



కార్గోలో లోడ్ అవుతున్న ష్రింప్

గతంలో 1000.. ఇప్పుడు లక్షన్నర

ఇక్కడి ష్రింప్ సీడ్ అంటే.. దేశంలోనే కాదు ప్రపంచంలోనూ మంచి గిరాకీ ఉంది. ఇక్కడి రొయ్యపిల్లల్ని (ష్రింప్ సీడ్) ఆయా రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు భద్రంగా తీసుకెళ్లి, వాటిని పెంచి డిమాండ్ వచ్చిన తర్వాత అమ్మకాలు ప్రారంభిస్తుంటారు. ఒకప్పుడు విశాఖ విమానాశ్రయం నుంచి రోజుకు కేవలం 1000 నుంచి 1500 కిలోలు ష్రింప్ మాత్రమే రవాణా జరిగేది. కానీ ఇప్పుడు నెలకు లక్షన్నర నుంచి సీజన్ సమయంలో 2 నుంచి 3 లక్షల కిలోల వరకూ రొయ్య పిల్లలు ఎగుమతులు జరుగుతున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో కార్గోకు స్పెషల్ ఫ్లైట్

మత్స్యకారుల అభివృద్ధి కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మెరైన్ కృషి ఉడాన్' పథకంతో పాటు వారికి లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే 15 ఏళ్లుగా సరకు రవాణా కోసం ప్రత్యేక విమానం కావాలన్న ఆకాంక్ష నెరవేర్చుతూ వైజాగ్ ఎయిర్‌పోర్టు నుంచి 2020 ఫిబ్రవరిలో వైజాగ్ నుంచి కార్గో సర్వీసు మొదలైంది. ఈ విమానాన్ని 90 శాతం శాసించింది మాత్రం ఇక్కడ పురుడు పోసుకున్న రొయ్యపిల్లలే కావడం విశేషం. అయితే ప్రస్తుతం కార్గో విమాన సర్వీసు నిలిచిపోయింది. దీంతో ఉభయ గోదావరి జిల్లాల నుంచి ష్రింప్ రావడం తగ్గిపోయింది. లేదంటే మరింతగా వైజాగ్ కార్గో దూసుకుపోయేది.

వైజాగ్ ఎయిర్‌పోర్ట్ నుంచి కార్గో రవాణా (కిలోల్లో)

నెల	ఎగుమతి	దిగుమతి	మొత్తం
సెప్టెంబర్-2023	166754	251022	417776
అక్టోబర్-2023	79246	286311	365557
నవంబర్-2023	73284	286831	360116
డిసెంబర్-2023	64,943	234726	299669
జనవరి-2024	78781	209095	287876
ఫిబ్రవరి-2024	165803	234337	400140
మార్చి-2024	250343	202641	452984
ఏప్రిల్-2024	205176	268512	473688



వైజాగ్ ఎయిర్‌పోర్టు నుంచి... రొయ్యపిల్లలు, మత్స్యసంపద ఎగుమతి దిగుమతుల వివరాలు

నెల	ఎగుమతి(కిలోల్లో)	దిగుమతి(కిలోల్లో)
జనవరిలో	40,596	20,527
ఫిబ్రవరిలో	1,20,507	26,789
మార్చిలో	1,68,738	20,020
ఏప్రిల్‌లో	1,65,622	19,764

ఇతర కార్గోలో ఒడిదుడుకులు..

మత్స్య ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతులు క్రమంగా పెరుగుతుండగా మిగిలిన కార్గో రవాణాలో మాత్రం ఒడిదొడుకులు కొనసాగుతున్నాయి. గతేడాది డిసెంబర్ వరకూ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ గూడ్స్ ఎగుమతులు విశాఖ నుంచి జరిగేవి. కానీ ఇప్పుడు ఎగుమతులు పూర్తి కనుమరుగవ్వడంతో పాటు దిగుమతి కూడా క్రమంగా తగ్గుముఖం పట్టింది. అదేవిధంగా.. ఇంజినీరింగ్ ఉత్పత్తులు, స్పేర్‌పార్ట్స్, ఫార్మా, విలువైన వస్తువుల కార్గోలోనూ ఇదే తీరు కనిపిస్తోంది. మొత్తంగా గతేడాది సెప్టెంబర్‌లో 1,66,754 కిలలో కార్గో ఎగుమతులు జరగ్గా.. 2,51,022 కిలోల కార్గో దిగుమతి విశాఖ నుంచి జరిగింది. ఇక ఈ ఏడాది చూస్తే.. ఏప్రిల్‌లో 2,05,176 కిలోల కార్గో ఎగుమతులు జరగ్గా.. 2,68,512 కిలోల దిగుమతులు నిర్వహించారు. ఓవరాల్‌గా చూస్తే.. 2023 సెప్టెంబర్‌లో 4,17,776 కిలల కార్గో రవాణా జరగగా ఈ ఏడాది ఏప్రిల్‌లో 4,73,688 కిలోలకు చేరుకుంది.





ఎయిర్‌పోర్టులో ఎగుమతులకు సిద్ధంగా ఉన్న రొయ్య పిల్లల బాక్సులు

ప్రత్యేక ప్రణాళికలు..



ఉత్తరాంధ్ర ష్రింప్‌కు మంచి డిమాండ్ లభిస్తోంది. రోజు రోజుకీ ఎగుమతుల్లో వృద్ధి కనిపిస్తోంది. ముఖ్యంగా ఇక్కడ దొరికే వనామీ రొయ్య పిల్లలకు వివిధ రాష్ట్రాలు, దేశాల్లో ఎక్కువ డిమాండ్ ఉంది. వ్యాపారులు కొనుగోళ్లని క్రమంగా పెంచారు. వైజాగ్ ఎయిర్‌పోర్టులో జరిగే ఎగుమతుల్లో సింహభాగం వరకూ మెరైన్ ఉత్పత్తులే ఉండగా ఇందులో 85 శాతం వరకూ రొయ్య పిల్లలే ఉంటాయి. డిమాండ్ ఎక్కువగా ఉన్న టైమ్‌లో ష్రింప్ కార్గో కోసం విమానంలో పాసింజర్స్ స్థానంలో సీట్లపై ఎలాంటి లీకేజీలు లేకుండా ప్యాక్ చేసి ఆన్‌సీట్‌లో ఎగుమతులు చేస్తున్నాం. రాష్ట్రంలో రొయ్య పిల్లల ఎగుమతుల్లో 80 శాతం వరకూ వైజాగ్‌లో జరుగుతుండగా 20 శాతం విజయవాడ, రాజమండ్రిలో జరుగుతున్నాయి. త్వరితగతిన రొయ్య పిల్లలు ఆయా ప్రాంతాలకు చేరుకోవడం వల్ల వ్యాపారులకు రెవెన్యూ పెరుగుతోంది. కొత్తగా వచ్చిన వ్యాపారులు కార్గో అవకాశాల్ని అందిపుచ్చుకోవాలి. - రాజారెడ్డి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్

సంగీతం భగవదత్తం



నేను ప్రకృతి ప్రేమికురాలిని

కాలానుగుణంగా మార్పులు సహజం

పాటలను ప్రేమించేవారికి కొదవ లేదు

సుమధుర గాయని సునీత

సంగీత ప్రపంచంలో ఆమె స్వరం మధురం. శ్రోతల హృదయాల్లో ఆమె పాటలు ఎప్పటికీ పదిలం. ఏ పాట పాడినా.. ఏ భావం పలికినా.. స్పష్టమైన ఉచ్చారణ ఆమె వరం. భయానకం, కరుణ, వీరత్వం, హాస్యం.. ఇలా సన్నివేశం ఏదైనా సరే దానికి ఆమె గళం తోడైతే ఇక ఆ పాట.. ఆ మాటా ఓ అద్భుతం అనాల్సిందే. పాటల ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకతను, గుర్తింపును సంపాదించుకుంది సునీత ఉపద్రష్ట. విశాఖకు వచ్చిన ఆమె 'సాక్షి'తో ముచ్చటించారు. -ఏయూక్యాంపస్

నాకు కొండలు, సముద్రం అంటే ఎంతో ఇష్టం, నేనొక ప్రకృతి ప్రేమికురాలిని. నిజంగా చెప్పాలంటే ప్రకృతి మధ్యలో దూర ప్రాంతాలకు ప్రయాణం చేయడానికి కూడా ఎంతో ఇష్టపడతాను. విశాఖకు వచ్చే సమయంలో విమానంలోంచి చూస్తే కొండలు, పక్కనే సముద్రం ఎంతో అందంగా కనిపించాయి.

సంగీతాన్ని ప్రేమించాలి

సంగీతం అనేది భగవదత్తంగా రావాలి. నేర్చుకుంటే జ్ఞానం వస్తుంది. స్వరం మాత్రం జన్మతహా వస్తుంది. సంగీతాన్ని భక్తిగా, శ్రద్ధగా స్వీకరించాలి. సంగీతాన్ని ప్రేమించాలి. నేటి తరం గాయకులకు ఇవే లక్షణాలు ఉండాలన్న నిబంధనలు లేవు. ఎవరు పాడినా తక్కువ సమయంలో పేరుప్రఖ్యాతులు తెచ్చుకునే పరిస్థితులు ఉన్నాయి.

నేను అదృష్టవంతురాలిని

చాలా కాలంగా పాటలు పాడటం వలన అనేక వైవిధ్యమైన పాటలు పాడే అవకాశం కలిగింది. అనేకమంది సంగీత దర్శకులు ఈ ప్రయాణంలో నన్ను ప్రోత్సహించారు. నా ముందుతరం వారు పాడిన కొన్ని పాటలు వింటుంటే కొన్ని సార్లు ఫీలైన సందర్భాలు ఉన్నాయి. ఇంతమంచి పాట నేను పాడలేకపోయాను అనే భావన కలిగింది.

విశాఖలో బంధువులున్నారు

మా అమ్మవాళ్లది విశాఖ. చిన్న తనం నుంచి అమ్మ ఈ నగరం గురించి చెబుతుంటే విశాఖపట్నం ఇలా ఉంటుందా అని ఊహించుకునే దాన్ని. అమ్మ చిన్నతనం ఇక్కడే సాగింది. అమ్మచెప్పినవి వింటూ ఊహల్లో పెరిగాను. ఆ విధంగా విశాఖ నగరంపై ప్రేమ పెరిగింది. నా ఊహలకంటే ఎంతో అందంగా విశాఖ ఉంది. కైలాసగిరి, రుషికొండ మీద నుంచి నగరాన్ని చూడటం, కొండ పక్కనుంచి వెళ్లే రహదారి చూడటానికి ఎప్పటికీ కొత్తగానే అనిపిస్తాయి. మా పెద్దమ్మ వాళ్లు విశాఖలో ఉండేవారు. ప్రకృతి అంతా ఇక్కడే ఉందని అని అనిపిస్తోంది. విశాఖ ప్రజలు ఎంతైనా అదృష్టవంతులు.



పరిధి పెరిగింది

నేడు సంగీత ప్రపంచం పరిధి విస్తరించింది, సినిమాల్లో పాత్ర, సంగీత దర్శకుడి ఆసక్తి, పరిస్థితులు ఆధారంగా పాటలు పెట్టడం జరుగుతోంది. సంగీతం నేర్చుకోవడం, గాయకులుగా స్థిరపడటంతో పాటు ఈ రంగంలో స్థానాన్ని నిలుపుకోవడం ఎంతో అవసరం.

ఇండిపెండెంట్ మ్యూజిక్‌కు ఆదరణ

కాలంతో పాటు మార్పుల్లో భాగంగా ఇండిపెండెంట్ మ్యూజిక్‌కి ఆదరణ, ప్రాముఖ్యత పెరిగింది. నేను కూడా దీనిలో భాగం అవుతున్నాను. సంగీత కార్యక్రమాలకు వచ్చే ప్రేక్షకులు సంఖ్య మాత్రం పెరుగుతూనే వస్తోంది. ఇది చాలా సంతోషాన్నిచ్చే అంశం.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ప్రమాద మృతులకు నివాళులర్పిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

- బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం
- వారికి సాయమందించేలా 'ప్రత్యేక సెల్'
- నగరంలో త్వరలోనే ఏఐ డ్రివిన్ ప్రాజెక్టు
- నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి



ప్రమాదంలో కోల్పోయిన తమ వ్యక్తిని చూపిస్తున్న మహిళ

విశాఖ విద్య: రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీలోని డాక్టర్ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో ఆదివారం ఏర్పాటు చేసిన 'వరల్డ్ డే ఆఫ్ రిమెంబరన్స్-2024 ' కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ క్షణం ప్రపంచంలో ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదాల వలన ప్రజలు గాయాలకు గురికావడం లేదా మరణించడం జరుగుతుందన్నారు. నగరంలో సెప్టెంబర్ నుంచి రహదారి నిబంధనలు కఠినతరం చేశామని, దీంతో రోడ్డు ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. గతంలో హెల్మెట్ ధారణ 10 శాతంగా ఉండేదని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లోనే అత్యధికంగా 50 శాతం నగరంలోనే నమోదైందని, ఇది నూరు శాతం చేయడం లక్ష్యమన్నారు. త్వరలో నగరంలో కొత్తగా 'ఏ.ఐ డ్రివిన్ ప్రాజెక్టు' ప్రారంభించనున్నట్టు చెప్పారు. సంపాదించే వ్యక్తి మరణిస్తే, ఆ కుటుంబాలకు సాయం అందించేందుకు 'రోడ్ ట్రాఫిక్ విక్టిమ్ అసిస్టెంట్ సెల్'ను త్వరలోనే విశాఖలో ప్రారంభిస్తామన్నారు.

కన్నీటి పర్యంతమైన బాధితులు

గత ఏడాది కాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాలు, ఆ ఘటనలకు సంబంధించి సీసీ కెమెరాలో బంధించిన దృశ్యాలను అందరికీ చూపించారు. వీటిని చూసిన బాధిత కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా వేదికపైకి వచ్చి కన్నీటి పర్యంతమై, తమ వారిని పోగొట్టుకొని ఏ రీతిన ఇబ్బందులకు గురౌతున్నామనేది తెలిపారు. వారి కన్నీటి రోదనతో అందరి మనసులు చలించిపోయాయి.

వాల్తేరులో వణుకు



'ఈయన మంచి డీఆర్‌ఎం.. మాకు టెండరు కావాలని అడిగితే.. ఎంతిచ్చినా తీసుకొని ఆ పనులు మాకే వచ్చేటట్లు చూసేవాళ్లు. అలాంటి మంచివ్యక్తిని సీబీఐ పట్టుకోవడమేంటి సార్..?" రైల్వే సంబంధిత పనులు చేపట్టే ఓ కాంట్రాక్టర్ చేసిన వ్యాఖ్యలివి.. సదరు కాంట్రాక్టర్.. తనకు రావాల్సిన పనులు ఆగిపోతాయేమోనన్న ఆందోళనతో చెప్పినా.. వాల్తేరు డీఆర్‌ఎం వ్యవహారమేంటనేది ఈ వ్యాఖ్యలే స్పష్టం చేస్తున్నాయి. వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్‌కుమార్ ప్రసాద్.. ముంబైలో శనివారం ఉదయం లంచం తీసుకుంటూ సీబీఐకి పట్టుబడిన విషయం తెలిసిందే. డీఆర్‌ఎంపై దర్యాప్తు బృందం దాడితో వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు, ఉద్యోగులు ఉలిక్కి పడుతున్నారు. డీఆర్‌ఎం వ్యవహారాలు చక్కబెట్టే ఉద్యోగులు తమ పరిస్థితేంటనే ఆందోళనలో ఉన్నారు.

- లంచాలకు అలవాటుపడిన డీఆర్‌ఎం
- ప్రతి టెండర్‌కు పచ్చనోటు ఇవ్వాల్సిందే
- రెండేళ్ల నుంచి డీఆర్‌ఎంపై నిఘా పెట్టిన సీబీఐ
- ఆది నుంచీ లంచాల ఆరోపణలే..
- సరైన సమయం కోసం ఎదురు చూసిన వైనం
- సీబీఐ విసిరిన వలలో చిక్కుకున్న సౌరభ్‌కుమార్
- ఉలిక్కిపడిన డీఆర్‌ఎం వ్యవహారాల్ని చూసే ఉద్యోగులు

సాక్షి, విశాఖపట్నం: వాస్తవానికి.. సీబీఐతో డీఆర్‌ఎం సౌరభ్‌కు కొత్త పరిచయం కాదని తెలుస్తోంది. గతంలో వాల్తేరు డీఆర్‌ఎంగా రాకమునుపు సెంట్రల్ రైల్వే జోన్‌లో ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ (పీసీఎంఈ)గా విధులు నిర్వర్తించే వారు. ఈయనకు ముందు పీసీఎంఈగా వ్యవహరించిన అధికారి.. రూ.లక్ష లంచం తీసుకుంటూ సీబీఐకి చిక్కారు. అనంతరం నిర్వహించిన సోదాల్లో రూ.23 లక్షలు, రూ.40 లక్షల విలువైన ఆభరణాలు, రూ.13 కోట్ల విలువైన ఆస్తులు, సింగపూర్, యూఎస్ బ్యాంకుల్లో రూ.1.63 కోట్ల డిపాజిట్లు ఉన్నట్లుగా సీబీఐ అధికారులు గుర్తించారు. ఆయన స్థానంలో పీసీఎంఈగా విధుల్లోకి వెళ్లిన సౌరభ్‌పై అప్పటి నుంచి కేంద్ర దర్యాప్తు బృందం నిఘా పెట్టింది. పలుమార్లు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నట్లు సమాచారం.

వైజాగ్ నుంచి ఫాలో చేస్తూ..

టెండర్ పాస్ చేసేందుకు లంచం అడుగుతున్నారంటూ ఓ కాంట్రాక్టర్ సీబీఐని ఆశ్రయించారు. దీంతో విశాఖ నుంచి దర్యాప్తు బృందం అధికారులు డీఆర్‌ఎం కదలికలపై నిఘాపెట్టారు. ముంబై వెళ్తున్నట్లు సమాచారం తెలుసుకొని అక్కడ బృందాల్ని అలెర్ట్ చేసినట్లు తెలుస్తోంది. అక్కడ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకోవడం.. మెర్సిడెస్ కారులో ఇంటికి వెళ్లిన వెంటనే సీబీఐ అధికారులు డీఆర్‌ఎంను అదుపులోకి తీసుకోవడం చకచకా జరిగిపోయాయి. రెండేళ్ల నుంచి నిఘా కొనసాగించిన సీబీఐ అధికారులకు ఎట్టకేలకు శనివారం చిక్కగా..సీబీఐ అధికారికంగా ఆదివారం వెల్లడించింది.

ఆ ఇద్దరిలో టెన్షన్

డీఆర్‌ఎంపై సీబీఐ దాడులతో.. డివిజన్‌లో ఉద్యోగుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. డీఆర్‌ఎం వ్యవహారాలు చక్కబెట్టిన ఇద్దరు ఉద్యోగులు.. సెలవుపై వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే.. సెలవులో వెళ్తే.. సీబీఐ దృష్టిలో పడతారంటూ సహచరులు చెప్పడంతో ఏం చెయ్యాలో పాలుపోక ఎప్పుడు తమని సీబీఐ విచారణకు పిలుస్తారోనంటూ బిక్కుబిక్కుమంటున్నారు.

విశాఖ రైల్వే పరువు తీసేశారు!

వాల్తేరు డివిజన్ చరిత్రలో సీబీఐ దాడుల్లో ఒక ఉద్యోగి, లేదా అధికారి పట్టుబడటం ఇదే మొదటిసారని ఉద్యోగులు చెబుతున్నారు. గతంలో డీఆర్‌ఎంలుగా వ్యవహరించిన అనూప్‌కుమార్ సత్పతి, చేతన్‌కుమార్ శ్రీవాత్సవ్.. డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారని.. అనేక సంస్కరణలు తీసుకొచ్చారని అంటున్నారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా.. ప్రతి అంశంలోనూ పారదర్శకంగా వ్యవహరిస్తూ.. తప్పు చేసిన ఉద్యోగులను బదిలీలు, సస్పెన్షన్లు చేసేవారని చెబుతున్నారు. సదరు సౌరభ్ వచ్చిన తర్వాత.. ఫిర్యాదులిస్తున్నా పట్టించుకోకుండా వాళ్లతో మిలాఖత్ అయిపోయేవారని కొందరు ఆరోపిస్తున్నారు. మొత్తంగా సీబీఐ వ్యవహారంతో విశాఖ రైల్వే డివిజన్‌పై మచ్చ పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంతిచ్చినా ఓకే...

లంచం వ్యవహారంలో సౌరభ్ చిక్కడంతో.. ఆయన చేసిన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. కాంట్రాక్టర్లతో నిరంతరం..డీఆర్‌ఎం కార్యాలయం బిజీ బిజీగా ఉండేదని తెలుస్తోంది. సివిల్, మెకానికల్ విభాగాలకు సంబంధించి టెండర్ల ద్వారా వచ్చిన డబ్బుల వసూళ్లకు డీఆర్‌ఎం కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగుల్ని ప్రత్యేకంగా నియమించినట్లు సమాచారం. టెండర్లు ఎవరికి రావాలంటే.. పని విలువ బట్టి వసూళ్లు రాబట్టేవారని వాల్తేరు డివిజన్ వర్గాలు చెబుతున్నాయి. రూ.50 వేల నుంచి వసూళ్ల పర్వం మొదలయ్యేదని కొందరు కాంట్రాక్టర్లు వాపోతున్నారు. డబ్బులిచ్చిన వారికే పనులకు సంబంధించిన టెండర్లు దక్కేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీఆర్‌ఎం అండ్ కో బ్యాచ్‌పై పలుమార్లు ఉన్నతాధికారులకు కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలుస్తోంది.

అమ్మ ప్రేమ

సృష్టిలో అమ్మ ప్రేమకు ఏదీ సాటి రాదు. అంతులేనిది, అపారమైనది. ఆమె మన కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటుంది. పట్టణానికి వలస వచ్చిన గిరిజన మహిళ తన కుమారుడిని ఒక చెట్టు నీడలో పరుండబెట్టి, కుటుంబాన్ని పోషించేందుకు కష్టపడుతోంది. ఈ చిత్రం తల్లి ప్రేమకు నిదర్శనంగా నిలుస్తుంది.





గ్లామర్ టచ్!

పెందుర్తి: పంట పొలాల్లో అందమైన భామలు సందడి చేస్తున్నారు. ఎక్కడంటారా? సబ్బవరం మండలం అమృతపురం సమీపంలో ఓ రైతు పంట చేనును పక్షుల నుంచి రక్షించేందుకు కాస్త 'మసాలా' అద్దాడు. వరి చేనుతో పాటు పుచ్చ పంటకు ఇటీవల కాలంలో పక్షుల బెడద ఎక్కువైంది. వాటి నుంచి పంటను కాపాడుకునేందుకు, అలాగే పంటకు దిష్టి తగలకుండా తన పొలంలో గ్లామర్ హీరోయిన్ తమన్నా, మరో వర్ధమాన నటి ఉన్న ఫ్లెక్సీలు పాతాడు. ఈ ఫ్లెక్సీలు అటు వైపు వెళ్లే వారి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ఐకమత్స్యం.. మహాబలం

కలిసి ఉంటే కలదు సుఖం అంటారు పెద్దలు. ఏ పని చేసినా కలిసి చేస్తే వచ్చే ఫలితం వేరే అబ్బా! ఇదే తరహాలో మత్స్యకారులు రెండు మర పడవలపై కలిసి చేపలు పట్టడంలో సఫలీకృతం అయ్యారు. విశాఖ ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో తీసిన చిత్రం ఇది..



ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్లు, విశాఖపట్నం

6న గాయని సునీత లైవ్ కాన్సర్ట్

ఏయూక్యాంపస్: నగరంలో డిసెంబర్ 6న లైవ్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నట్లు సినీ నేపథ్య గాయని సునీత తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఎంజీఎం మైదానంలో ఆ రోజు సాయంత్రం ఈ కార్యక్రమం ఉంటుందని, సముద్ర తీరంలో మంచి పాటలతో కార్యక్రమం నిర్వహించాలన్న తన చిరకాల కోరిక తీరబోతోందన్నారు. ప్రిజం క్లబ్, సీన్‌సెట్టర్స్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖలో తనకు ఇదే తొలి లైవ్ కాన్సర్ట్ అని, ప్రజలంతా పాల్గొనాలని కోరారు. అనంతరం యాంకర్ నిఖిల్ విజయేంద్ర సింహా, ప్రణీత్ పారేపల్లితో కలిసి కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.



కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సునీత, నిఖిల్ తదితరులు

ఆ పాపాయిల విషయంలో జాగ్రత్తలు అవసరం

ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే కార్యక్రమంలో కలెక్టర్ సూచన

సీతంపేట: నెలలు నిండకుండా జన్మించిన శిశువుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులకు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. మెడికవర్ వుమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలోని బ్యాంకెట్ హాల్లో ఆదివారం ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే జరిగింది. వీఎంఆర్డీఏ చైర్మన్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రీమెచ్యూర్ శిశువులు ఎదిగే క్రమంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఆస్పత్రి నియోనాటాలజిస్ట్ సాయి సునీల్ కిశోర్ మాట్లాడుతూ 23 నుంచి 37 వారాల మధ్య పుట్టే శిశువులను ప్రీమెచ్యూర్ పిల్లలుగా పరిగణిస్తారన్నారు. వీరు ఎదిగే క్రమంలో ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలకు లోనవుతారన్నారు. ఎక్స్‌ట్రీమ్ ప్రీమెచ్యూర్ పిల్లల్లో సమస్యలు మరింత ఎక్కువగా ఉంటాయని, శిశువు లోపల అవయవాలు పూర్తిగా అభివృద్ధి చెందవన్నారు. అటువంటి శిశువు సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. నెలలు నిండకుండా పుట్టే పిల్లలు తల్లి పాలు తాగలేరని, శ్వాసకోస సమస్యలు, న్యూట్రిషనల్ ఇన్‌ఫెక్షన్స్, షుగర్ లెవెల్స్‌లో హెచ్చు తగ్గులు వంటి సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఇటువంటి పిల్లలను ఇంక్యుబేటర్‌లో ఉంచి వెంటిలేటర్ సహాయంతో వైద్యం అందించాల్సి ఉంటుందన్నారు. వైద్యులు విద్యారమ, గీత వందన, భూలక్ష్మి, రాధిక, విజయ్, మౌనిక, సెంటర్ హెడ్ శ్యామల, ప్రీమెచ్యూర్ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

శిశువుల ఆరోగ్యంపై అవగాహన నడక

ఏయూక్యాంపస్: దేశంలో ఏటా మూడు మిలియన్ల మంది శిశువులు నెలలు నిండకుండానే జన్మిస్తున్నారని వైద్య నిపుణులు తెలిపారు. ప్రపంచ ప్రీమెచ్యూరిటీ డే సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం బీచ్‌రోడ్‌లో అవగాహన నడక నిర్వహించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఆస్పత్రి నియోనాటాలజిస్ట్ పి.బాల శ్రీలత మాట్లాడారు. నెలలు నిండకుండా జన్మించే శిశువుల విషయంలో ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు. శిశువు బరువు కిలో కంటే తక్కువ ఉన్న వారికి కూడా చికిత్స అందించినట్లు చెప్పారు. డాక్టర్ వి.సతీష్ మాట్లాడుతూ అత్యాధునిక నవజాత శిశు సంరక్షణ సదుపాయాలు నేడు అందుబాటులో ఉన్నాయన్నారు. 37 వారాల కంటే తక్కువ సమయంలో జన్మించే వారిని ప్రీమెచ్యూర్ బేబీలుగా పరిగణిస్తారన్నారు. ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా నిర్ణీత సమయం కంటే ముందుగా జన్మించిన శిశువుల్లో ఎక్కువ మంది ఐదేళ్ల వయసులోపు మరణిస్తున్నారని, వీరిని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్‌లో కంటికి రెప్పలా కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఆర్.రవి చంద్రన్, వైద్యులు, నగర పౌరులు వివిధ కళాశాలల విద్యార్థులు, జాతీయ సేవా పథకం వలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



నడకను ప్రారంభిస్తున్న వైద్యులు

ఉపాధ్యాయ ఓటర్ల దరఖాస్తుల పరిశీలన

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు కోసం సమర్పించిన దరఖాస్తులను చురుగ్గా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి మొత్తం 17,404 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ ద్వారా 4,802, ఆఫ్‌లైన్ ద్వారా 12,602 దరఖాస్తులు స్వీకరించారు. ఈ దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ వరకు పరిశీలిస్తారు. 23న ఓటర్ల నమోదుపై డ్రాఫ్ట్‌ను ప్రచురిస్తారు. ఈ డ్రాఫ్ట్ పబ్లికేషన్ మీద 23 నుంచి డిసెంబర్ 9వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,523 మంది ఓటర్లు నమోదు చేసుకున్నారు. ప్రస్తుత ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతుంది.

దరఖాస్తులు ఇలా..

జిల్లా	ఆన్‌లైన్	ఆఫ్‌లైన్	మొత్తం
విశాఖ	1,252	2,093	3,345
శ్రీకాకుళం	2,072	2,392	4,464
విజయనగరం	555	3,273	3828
పార్వతీపురం మన్యం	340	1,796	2,136
అల్లూరి సీతారామరాజు	212	1,537	1,749
అనకాపల్లి	371	1,511	1,882

'అపార్'మైన కష్టాలు

- రికార్డుల్లో పేర్లు తప్పిదంతో ఇబ్బందులు
- ఇప్పటి వరకు 71.47 శాతం కార్డుల జనరేట్
- ఆధార్‌లో పేర్ల సవరణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- నేటి నుంచి మూడు రోజులు మార్పులకు అవకాశం

విశాఖ విద్య: ప్రతీ విద్యార్థికి అపార్(ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు జారీ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలు.. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు అపారమైన కష్టాలు తెచ్చిపెట్టాయి. అపార్ వివరాల నమోదులో యు డైస్ ప్లస్, పాఠశాలలోని అడ్మిషన్ రికార్డు, ఆధార్ కార్డులోని వివరాలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ఈ మూడింటిలో ఏ ఒక్క దానిలో ఒక్క అక్షరం తప్పు ఉన్నా.. అపార్ కార్డు జనరేట్ కావడం లేదు. ఆధార్‌లో విద్యార్థుల వివరాలు తప్పుల తడకగా ఉండడం, జనన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ఆన్‌లైన్‌లో పొందుపర్చడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. మరోవైపు ఆధార్‌ను సరిచేసేందుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ నెలాఖరు నాటికి 100 శాతం మేర అపార్ కార్డులు జనరేట్ చేసేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ఆపసోపాలు పడుతున్నారు.



తల్లిదండ్రులకూ తప్పని ఇబ్బందులు

ఆధార్ కార్డులో వివరాలు సవరణ చేసుకొస్తేనే అపార్‌లో నమోదు చేస్తామని ఉపాధ్యాయులు చెబుతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు సచివాలయం, మీసేవ, ఆధార్ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. రోజు వారీ పనులు మానుకుని కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుండటంతో ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.

జనన ధ్రువీకరణ పత్రాలకు గిరాకీ

విద్యార్థుల పుట్టిన తేదీ, పేర్లు పాఠశాలల రికార్డుల్లో ఒకలా.. ఆధార్ కార్డులో మరోలా ఉన్నాయి. ఆధార్ కార్డులో కేవలం సంవత్సరం మాత్రమే ఉంది. ఇది మార్చాలంటే పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న వారు చాలా తక్కువ. కాగా ప్రస్తుతం ఆధార్‌లో పుట్టిన తేదీ అప్‌డేట్ కోసం లాయర్ వద్ద నోటరీ తీసుకోవాలి. దీన్ని జతచేసి మున్సిపల్ కార్పొరేషన్ లేదా పంచాయతీ కార్యాలయాల్లో సర్టిఫికెట్ తీసుకోవాలి. ఇదంతా పూర్తయ్యేందుకు సుమారు 20 రోజులు పడుతుంది. అప్పటికి అపార్ నమోదు గడువు కూడా ముగిస్తుందనే ఆందోళనలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఉన్నారు.

లక్ష్య సాధనకు ఆమడ దూరం

జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 4,25,301 మంది విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ఈ నెల 17 వరకు 3,03,974 మందికి అపార్ జనరేట్ చేశారు. దీంతో 71.47 శాతం లక్ష్యం సాధించారు. పాఠశాల స్థాయి వరకు బాగానే ఉన్నా.. ఇంటర్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల వివరాలు నమోదు చేసేందుకు తీవ్ర జాప్యం చేస్తున్నాయి. ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం కలిపి 81,242 మందికి గానూ ఇప్పటి వరకు 31,900 మంది విద్యార్థుల వివరాలే నమోదయ్యాయి.

12 స్కూళ్లలో ఆధార్ శిబిరాలు

ఆధార్ కార్డుల్లో పేర్లు, ఇతర వివరాల సవరణ కోసం విద్యార్థుల సౌకర్యార్థం జిల్లాలోని 12 పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జెడ్పీహెచ్‌ఎస్ గాజువాక, నరవ, గోపాలపట్నం, చంద్రపాలెం, అక్కిరెడ్డిపాలెం, వేపగుంట, పెందుర్తి మండలం సరిపల్లి, పద్మనాభం, ఎమ్మార్సీ పెదగంట్యాడ, జీవీఎంసీ హైస్కూల్ మల్కాపురం, ఎన్‌జీజీవోస్ కాలనీ, జీవీఎంసీ హైస్కూల్ దండుబజార్‌ల్లో ఈ కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ఇవి పనిచేస్తాయి. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకునేలా పాఠశాలల హెచ్‌ఎంలు, కాలేజీల ప్రిన్సిపాళ్లు శ్రద్ధ తీసుకోవాలని డీఈవో ప్రేమ్‌కుమార్, ఇంటర్ బోర్డు ఆర్‌ఐవో పి.మురళీధర్ ఆదేశించారు.

21 నుంచి 'గైస్'లో జాబ్‌మేళా

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్)లో ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఎంఆర్‌ఎఫ్ సంస్థలో 18 నుంచి 25 ఏళ్ల వయసు మధ్య గల డిగ్రీ, డిప్లమో, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు(పురుషులు) ఆపరేటింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 21, 22వ తేదీల్లో డిగ్రీ లేదా డిప్లమో పూర్తి చేసిన అభ్యర్థులకు, ఈ నెల 23, 24 తేదీల్లో 10వ తరగతి, ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన డిగ్రీ లేదా డిప్లమో అభ్యర్థులకు మొదటి సంవత్సరం రూ.19,500, రెండవ సంవత్సరం రూ.20,500, మూడవ సంవత్సరం రూ.21,500 స్టైఫండ్ చెల్లించనున్నారు. సర్వీస్ పెరిగే కొద్దీ వేతనం పెరుగుతుంది. ఉద్యోగం చేస్తూ మాస్టర్ డిప్లమో సర్టిఫికెట్ పొందే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. 10వ తరగతి, ఐటీఐ పూర్తి చేసిన వారికి మొదటి సంవత్సరం రూ.18,000, రెండవ సంవత్సరం రూ.18,500, మూడవ సంవత్సరం రూ.19,000 స్టైఫండ్ చెల్లిస్తారు. అభ్యర్థులు రెజ్యూమ్‌తో పాటు ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఆరు పాస్ పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హతకు సంబంధించి జిరాక్స్ కాపీలు తీసుకురావాలని, ఒరిజినల్స్ చూపించాలని ప్రిన్సిపాల్ సూచించారు. ప్రయాణ రాయితీ, క్యాంటీన్ సదుపాయంతో పాటు కంపెనీ నిబంధనలను అనుసరించి వసతి కూడా ఏర్పాటు చేస్తారు. 2018–24 మధ్య ఉత్తీర్ణులైన వారు మాత్రమే ఈ ఇంటర్వ్యూలకు అర్హులు.

జూ ఆదాయం రూ.7.64 లక్షలు



జూ ప్రధాన ద్వారం వద్ద క్యూలో సందర్శకులు



సీతాకోక చిలుకల పార్కు వద్ద సందడి చేస్తున్న పిల్లలు

ఆరిలోవ: కార్తీకమాసం మూడో ఆదివారం జూ పార్కు.. సందర్శకులతో కిటకిటలాడింది. పిల్లలు, పెద్దలు వన్యప్రాణులను తిలకించడంతో పాటు ఆటపాటలతో సరదాగా గడిపారు. వివిధ రకాల పక్షులు, నల్ల హంసలు, ఖడ్గమృగం, కోతులు, ఏనుగులు, పులులు, జిరాఫీలు, చింపాంజీలు, పాములు సందర్శకులను అలరించాయి. వీటి వద్ద సందర్శకులు సెల్ఫీలు తీసుకున్నారు. చెట్ల కింద, షెల్టర్లలో కుటుంబ సమేతంగా వనభోజనాలు చేశారు. జాతీయ రహదారి పక్కన ప్రధాన ద్వారం, బీచ్‌రోడ్డులో సాగర్ ద్వారం నుంచి ఆదివారం ఒక్క రోజు 10,006 మంది సందర్శించినట్లు జూ ఇన్‌చార్జి క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. సందర్శకులతో పాటు లోపలకు ప్రవేశించిన కార్ల ద్వారా రూ.7,64,640 ఆదాయం లభించినట్లు ఆమె వెల్లడించారు.

కంబాలకొండకు రూ.65 వేలు..

కంబాలకొండ ఎకో టూరిజం పార్కు ఆదివారం సందర్శకులతో కళకళలాడింది. ఇక్కడ చెట్ల కింద సందర్శకులు వనభోజనాలు చేశారు. విశాలమైన మైదానాల్లో రోజంతా ఆటలతో సరదాగా గడిపారు. ఆట పరికరాల వద్ద పిల్లలు సందడి చేశారు. కంబాలకొండను ఆదివారం 900 మంది సందర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు. వారి ద్వారా రూ.65,000 ఆదాయం లభించిందన్నారు.

సీపీఎస్ రద్దుపై మీనమేషాలు తగదు

- ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి రఘునాథరెడ్డి

విశాఖ విద్య: ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను తక్షణమే చెల్లించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగిన ఎస్టీయూ ఉత్తరాంధ్ర జిల్లాల ముఖ్య బాధ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తుది చెల్లింపులు, రుణాల చెల్లింపులపై ప్రభుత్వం ఇంత వరకు స్పందించకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి వెంటనే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ఎప్పటిలోగా బకాయిలు చెల్లిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. 12వ పీఆర్సీ అమలు చేయవలసిన గడువు ఇప్పటికే 17 నెలలు ఆలస్యమైందని.. వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించి పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాల భారం తగ్గిస్తామన్న ప్రభుత్వం ఆచరణలో చూపడం లేదన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించాలన్న చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. సీపీఎస్ రద్దు పై అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామన్న ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు మెమో నం.57 మేరకు 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింప చేయాల్సి ఉండగా.. ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల పదవీ విరమణ వయసు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్లస్ టు పాఠశాలలను ప్రారంభించి ఉపాధ్యాయులను మాత్రం నియమించలేదన్నారు. పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఎస్జీటీ తత్సమాన పోస్టులను వెంటనే ఉన్నతీకరించాలన్నారు. డీఎస్సీ వెంటనే ప్రకటించాలని డిమాండ్‌చేశా రు. విద్యారంగ సమస్యలపై, ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. రాష్ట్ర కార్యదర్శి డి.శ్యాం, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దేముడుబాబు, ఇమంది పైడిరాజు, రమణమూర్తి, తమ్మినాయుడు, కె.జోగారావు, సూరిబాబు, రవి, పరదేశి, వరలక్ష్మి, పురుషోత్తం, జగదీష్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

నకిలీ నోట్ల చలామణి ముఠా అరెస్ట్

పరవాడ: లంకెలపాలెం ప్రాంతంలో నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న నలుగురిని పరవాడ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు అందించిన వివరాలివీ.. కోనసీమ జిల్లా ముమ్మిడివరానికి చెందిన గుత్తుల విశాల్.. అతని మామయ్య శీలం శ్రీనుతో కలిసి ఈ నెల 16న వ్యానులో కొబ్బరి బొండాల లోడుతో బయలుదేరాడు. ఎన్ఏడీ కొత్త రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు అన్‌లోడ్ చేశారు. తిరుగు ప్రయాణంలో లంకెలపాలెం కూడలిలో టీ తాగడానికి సాయంత్రం 4.30 గంటలకు ఆగారు. ఆ సమయంలో అక్కడకు అనకాపల్లి మండలం విజయరామరాజపేటకు చెందిన ఒమ్మి భానుప్రకాష్, వై.ఆదర్స్, పెదరెల్లి వీధికి చెందిన పొట్నూరు హరిచంద్ర ప్రసాద్, విజయనగరం జిల్లా రాజాం మండలం బురదకు చెందిన తీగల క్రాంతికుమార్ వచ్చారు. రూ.500 నోటుకు చిల్లర అడిగారు. అది నకిలీ నోటు అని గమనించక విశాల్ చిల్లర ఇచ్చాడు. ఇదే అదనుగా భావించిన ఆ వ్యక్తులు మరో నాలుగు నకిలీ రూ. 500 నోట్లు ఇచ్చి చిల్లర ఇవ్వమని కోరగా.. వాటికి కూడా విశాల్ చిల్లర ఇచ్చాడు. వెంటనే ఆ నలుగురు అక్కడి నుంచి జారుకున్నారు. అనంతరం విశాల్ ఆ నోట్లను పరిశీలించగా.. చిల్డ్రన్ బ్యాంకు ఆఫ్ ఇండియా అని ముద్రించి ఉండటం గమనించాడు. వెంటనే పరవాడ పోలీసులను ఆశ్రయించాడు. సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ బి.కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆ నలుగురిని మంత్రిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సాయంత్రం అరెస్టు చేశారు. ఆరు నకిలీ రూ.500 నోట్లు, 20 అసలు రూ.100 నోట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.



చిల్డ్రన్ బ్యాంక్ పేరుతో ముద్రించిన నోట్లు

భారతీయ నృత్య వైభవ ప్రతీక

పరంపర నృత్యోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూక్యాంపస్: భారతీయ నృత్య వైభవానికి ప్రతీకగా పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన నిలిచింది. ప్రముఖ స్టెప్ డ్యాన్స్ సంస్థతో కలిసి ఎం.జి.ఎం పార్క్ ఆవరణలో నిర్వహించిన ఈ నృత్యోత్సవం విశాఖ వాసులను సంభ్రమాశ్చర్యానికి గురిచేసింది. 2 వేల సంవత్సరాల పూర్వపు భారతీయ నృత్య కళకు ఆధునిక భావాలను మేళవిస్తూ చేసిన ప్రదర్శన కట్టిపడేసింది. కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కార్యక్రమాన్ని ఆద్యంతం తిలకించి.. కళాకారులను అభినందించారు. ముందుగా శ్రీరామ జననం నుంచి రావణ వధ వరకు రామాయణ ఘట్టాన్ని వేదికపై ఎంతో హృద్యంగా ఆవిష్కరించిన విధానం అద్భుతంగా సాగింది. సౌత్ ఇండియాలోని శిల్పకళల నుంచి స్ఫూర్తిని స్వీకరిస్తూ యోగా, కథక్ నృత్యాలను మేళవించి, 2వేల సంవత్సరాల కిందట నాట్య శాస్త్ర పుస్తకాలలో జ్ఞానాన్ని జోడించి చేసిన శివతాండవం కైలాసంలో ఉన్నామనే భావనకు గురిచేసింది. మరొక నృత్యంలో పంచభూతాలను అనుసంధానం చేస్తూ మండల ఉషస్సు నృత్యం భారతీయ వారసత్వం, సంస్కృతిని ఆవిష్కరించింది. 75 ఏళ్ల భారతీయ స్వాతంత్ర్య సంబరాలను పురస్కరించుకుని రూపకల్పన చేసిన రాప్సిడి నృత్యం భారతీయ స్వాతంత్ర్యయోధుల కృషిని కళ్లకు కట్టింది. క్రీడలను నృత్యానికి జోడించి చేసిన ప్రదర్శన.. భారతీయ నృత్య వైశిష్ట్యానికి మచ్చుతునకగా నిలిచింది. పరంపర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శ్రీ నాగి బి.రావు, శశిరెడ్డిలు మాట్లాడుతూ సంప్రదాయ కళారూపాలను ఆధునిక కాలంలో ఏవిధంగా ప్రాముఖ్యతను సంతరించుకుంటున్నాయో ప్రజలకు తెలియజేయడం తమ లక్ష్యమన్నారు. స్టెప్ డ్యాన్స్ సంస్థ నిర్వాహకురాలు మధు నటరాజన్ కళారూపాలను వివరించిన విధానం ప్రత్యేకంగా నిలిచింది.



శివ తాండవం నృత్య ప్రదర్శన

ఎస్‌బీ ఏసీపీ చిట్టిబాబు బాధ్యతల స్వీకరణ

అల్లిపురం: నగర స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఐ.చిట్టిబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చిని మర్యాద పూర్వకంగా కలసి మొక్క అందజేశారు. 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన చిట్టిబాబు 5వ బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తించారు. నగర టాస్క్‌ఫోర్స్ ఏసీపీగా కూడా కీలక బాధ్యతలు నిర్వహించారు.



సీపీని కలిసిన ఏసీపీ చిట్టిబాబు

పాలిటెక్నిక్‌లో రేపు ఉద్యోగమేళా

మురళీనగర్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఈ నెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. హోబెల్ బెలోస్‌కో, దసపల్లా హోటల్స్, వరుణ్ మోటార్స్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశారు. డిప్లమో, బీటెక్ మెకానికల్, ఏదైనా ఐటీఐ, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాలకు 77025 06614లో సంప్రదించాలని సూచించారు.

డాక్టర్ రఘురామారావుకు అరుదైన అవార్డు

మహారాణిపేట: డెర్మటాలజీలో మార్గదర్శకుడిగా పేరొందిన కేజీహెచ్ డెర్మటాలజీ విభాగ విశ్రాంత అధిపతి డాక్టర్ జి.రఘురామారావుకు అరుదైన గౌరవం దక్కింది. చెన్నైలో జరిగిన టీఎన్ క్యూటీకాన్‌లో డెర్మాజోన్ సౌత్-2024 సదస్సులో శనివారం ఆయనకు డోయెన్ ఆఫ్ డెర్మటాలజీ అవార్డును ప్రదానం చేశారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనిరియాలజిస్ట్స్, లెప్రోలాజిస్ట్స్ (ఐఏడీవీఎల్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.మంజునాథ్ చేతుల మీదుగా ఈ అవార్డును రఘురామారావు అందుకున్నారు. డాక్టర్ రఘురామారావు 40 ఏళ్లుగా బోధన, క్లినికల్ అనుభవంతో జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో 100 కంటే ఎక్కువ శాస్త్రీయ కథనాలు ప్రచురించారు. ఆంత్రాక్స్, బ్లాస్టోమైకోసిస్, అరాక్నిడ్ బైట్స్ వంటి అంశాలపై పుస్తక అధ్యాయాలను అందించారు. ఈ సేవలకు గుర్తింపుగా ఆయనకు డోయెన్ ఆఫ్ డెర్మటాలజీ అవార్డు ప్రదానం చేశారు.



డాక్టర్ రఘురామారావును అభినందిస్తున్న డెర్మటాలజిస్టులు

అయ్యప్ప స్వాములను రక్షించిన ఫొటోగ్రాఫర్లు

భీమునిపట్నం: భీమిలి తీరంలో ఇద్దరు అయ్యప్ప మాలధారులను బీచ్ ఫొటోగ్రాఫర్లు రక్షించారు. ఆదివారం సాయంత్రం ఇక్కడ స్నానాలకు ఇద్దరు స్వాములు దిగి ప్రమాదవశాత్తు కొట్టుకుపోతుండగా ఫొటోగ్రాఫర్లు కాసరపు సతీష్, కాసరపు నాగరాజు గమనించారు. వెంటనే స్పందించి వారిని రక్షించారు. తమ వివరాలు చెప్పడానికి స్వాములు ఇష్టపడలేదు. ఫొటోగ్రాఫర్లను పలువురు అభినందించారు.

మిసెస్ వైజాగ్-2024 పోస్టర్ ఆవిష్కరణ

బీచ్‌రోడ్డు: హేంషైర్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో మిసెస్ వైజాగ్-2024 పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని ఒక హోటల్‌లో జరిగిన హేంషైర్ ఈవెంట్ అధినేత వాసు మాట్లాడుతూ 2013 నుంచి ఏటా మిసెస్ వైజాగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు సాధికారత కల్పించడానికి ఒక వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. డిసెంబర్‌లో గ్రాండ్ ఫినాలే ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు 98669 99997కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మిసెస్ వైజాగ్-23 సాక్షి బజాజ్, సబ్ టైటిళ్లు సాధించిన దివ్య, శ్రావ్య, ఇషా, ఇందు, సరిత, దియ, సౌజన్య పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మిసెస్ వైజాగ్ -23 విజేత సాక్షి బజాజ్